క్లుప్తంగా

జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతున్న ప్రతినిధి

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి 137 మంది హాజరు కాగా వారిలో 65 మంది ఎంపికయ్యారు. ఏడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ మహిళా చట్టాలు, రాజ్యాంగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక హక్కులను కాపాడుకోవడంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అప్పుడే దేశం ప్రగతి బాటలో నడుస్తుందని తెలిపారు. సమయం చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకున్నవారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. సదస్సులో విశ్రాంత జడ్జి శ్రీనివాస్, ప్యానల్ అడ్వకేట్ దేవీ భవాని, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారికి యూటీఎఫ్ వినతి



డీఈవో వాసుదేవరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: మున్సిపల్, మునిసిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావుకు శుక్రవారం యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. మున్సిపల్ హైస్కూల్లో పోస్టులను అప్‌డేట్ చేయాలని, బదిలీలు పదోన్నతులు నిర్వహించాలని, అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తదుపరి కార్యాచరణలో భాగంగా అక్టోబర్ రెండున మున్సిపాలిటీలలో సత్యాగ్రహ దీక్ష జరుగుతుందని తెలిపారు.

మంచి ఆలోచనలతోనే మంచి పనులు



మాట్లాడుతున్న స్వామి సేవానందజీ మహారాజ్

కంబాలచెరువు: నిరంతరం మంచిగా ఆలోచించగలిగితే మంచి పనులు చేయగలుగుతామని రాజమండ్రి వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ స్వామి సేవానందజీ మహారాజ్ అన్నారు. స్వామి వివేకానంద చికాగోలో ఉపన్యాస దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేంద్ర కారాగారంలో ఖైదీలకు మానసిక పరివర్తన ప్రేరణ ఉపన్యాసం అందించారు. ఈ సందర్భంగా సేవానందజీ మహారాజ్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో పాజిటివ్ ఎనర్జీ వస్తుందన్నారు. హ్యూమన్ ఎక్సలెన్స్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ మాట్లాడుతూ మానసిక బలం పెరగాలంటే వివేకానందుని రచనలు చదవాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర కారాగార సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

కంబాలచెరువు: అనధికారికంగా బాణాసంచా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహ కిషోర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే నిబంధలనకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి జన సంచార స్థలాల్లో, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా 112కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

దూకుడు తగ్గేదెలా..

- సమస్యగా మారిన మైనర్ల డ్రైవింగ్
- నిబంధనలను పట్టించుకోని బాలురు
- రాంగ్ రూట్‌లో వస్తున్న వారితో ప్రమాదాలు



కుమారి థియేటర్ రోడ్డులో వాహనంపై దూసుకుపోతున్న బాలుడు

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. అనేక మంది తమ వాహనాలతో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. వీరిలో లైసెన్సు లేనివారు, నిబంధలను అతిక్రమించి రాంగ్ రూట్ లో ప్రయాణం చేసేవాళ్లు, సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయేవారు కూడా ఉంటారు. అయితే నగరంలో ఇప్పుడు కొత్తగా మైనర్ల డ్రైవింగ్ సమస్య తలెత్తింది. నిండా 15 ఏళ్లు లేని బాలురు మోటారు సైకిళ్లపై స్పీడుగా దూసుకుపోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, పక్క వాహనాలను పట్టించుకోవడం లేదు. తెలిసీతెలియని వయసులో, వేగంగా నడపడమే గొప్పగా భావిస్తున్నారు. తమ ముందు వెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేస్తూ, బండిపై విన్యాసాలు చేస్తూ నడుపుతున్నారు. వాహనం గేర్ మార్చాలన్నా, ఎదురుగా ఏదైనా వస్తే బ్రేక్ వేసేందుకు కూడా వీరికి కుదరదు. వీరి కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనచోదకుల అవస్థలు

ద్విచక్ర వాహనాలపై దూసుకుపోతున్న మైనర్లతో ఆ రోడ్డుపై వెళుతున్న మిగిలిన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తుంటారు. వీరి ముందు నుంచే మైనర్లు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుంటారు. కనీసం వీరిని ఆపి కౌన్సెలింగ్ చేసేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను పట్టుకుని, కఠిన చర్యలు చేపడితేనే గానీ దీనికి క్లెం వేయలేం. అలాగే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. వారిని వివిధ పనులపై పంపుతున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం. ఇది తెలిసినా చాలామంది తల్లిదండ్రులలో మార్పు రావడం లేదు. సక్రమంగా రాని డ్రైవింగ్‌తో చాలామంది మైనర్లు రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఒక్కోసారి నిబంధనలు పాటిస్తూ వస్తున్న వారిని.. వీరు ఎదురుగా వెళ్లి ఢీకొడుతున్నారు. ఇలాంటి అనేక సంఘటనలు కళ్ల ముందు జరుగుతున్నాయి. మైనర్ల డ్రైవింగ్‌పై నగరంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కౌన్సెలింగ్ కార్యక్రమాలు అప్పుడప్పుడూ నిర్వహిస్తున్నారు.

రాంగ్ రూట్ డ్రైవింగ్

నగరంలోని పలు ప్రాంతాల్లో అపసవ్య దిశలో వాహనాలు నడపడం చాలా అధికంగా ఉంది. రాంగ్ రూట్‌లో వస్తున్న వారితో మిగిలిన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి అనుకోని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు, చిరంజీవి బస్‌షెల్టర్, దేవీచౌక్, కియా షోరూమ్ వద్ద, లాలాచెరువు నుంచి సీటీఆర్ఐ సెంటర్ వెళ్లే రోడ్డు.. అనే అనేక ప్రాంతాల్లో రద్దీ ట్రాఫిక్ మధ్య రాంగ్ రూట్‌లో వాహనాలు నడుతున్నారు. కంబాల చెరువు చిరంజీవి బస్టాండ్ వద్ద అయితే ఈ సమస్య మరింత అధికంగా ఉంది. నిత్యం ఆ ప్రాంతంలో అధిక సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్వతంత్ర ఆసుపత్రి, లలితా నగర్, పేపర్‌మిల్లు వైపు నుంచి వచ్చే వారు దండి మార్చి విగ్రహాల చుట్టూ తిరిగి కంబాలచెరువు పార్కు వైపునకు రావాలి. అయితే అందతా తిరగడం ఎందుకని అపసవ్య దిశలో కంబాలచెరువు పార్కు వైపు రోడ్డులోకి వచ్చేస్తున్నారు.

ఒక సీఐ, ఒక ఎస్సైతోనే సరి..

రాజమహేంద్రవరం నగరం మొత్తానికి ఒక ట్రాఫిక్ సీఐ, ఒక ఎస్సై మాత్రమే ఉన్నారు. వీరే నగరమంతా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలి. నగరంలో రద్దీ పాయింట్లు ఎక్కువ, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తక్కువ. దీంతో నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కష్టతరంగా మారింది. రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఐదుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు కావాలి. వీరిని భర్తీ చేస్తే సమస్యను కొంత మేర పరిష్కరించవచ్చు.

చర్యలు చేపడతాం



నగరంలో ట్రాఫిక్ సమస్య ఉంది. దీనిపై వెంటనే దృష్టి సారించి చర్యలు చేపడతాం. కంబాలచెరువు, దండిమార్చి విగ్రహాల వద్ద రాంగ్ రూట్‌లో ఎక్కువమంది వస్తున్నారు. ఆ ప్రాంతంలో పోలీస్ బీట్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. రాంగ్ రూట్‌లో వాహనాలు నడుతున్న వారిపై చర్యలు చేపడతాం. డ్రైవింగ్ చేస్తున్న మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్ ద్వారా కేసులు రాస్తున్నాం.

– ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

జైపూర్‌కు పీఎంపీ రాష్ట్ర ప్రతినిధులు



జైపూర్ వెళుతున్న పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు

ధవళేశ్వరం: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఈఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం తరలి వెళ్లారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ముఖేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో జైపూర్ పీఎంపీ భవన్‌లో ఆదివారం జాతీయ కార్యవర్గ సమావేశం జరగనుంది. దీనికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నుంచి 15 మంది ప్రతినిధుల బృందం తరలి వెళ్లింది. వారిలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, కోశాధికారి వేణుగోపాల్, సహాయ కార్యదర్శి కె.జనార్దన్, జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఏఆర్కే పరమేశ్వర్లు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ఎస్ సింహాచలం, రాజమహేంద్రవరం అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, షేక్ చిట్టి సుభాన్, పి.దేవానందం, గోపాల నాయుడు ఉన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన



ఊర్ధ్వసాయిన్‌ను అభినందిస్తున్న ఓఎన్‌జీసీ ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్

రాజమహేంద్రవరం రూరల్: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఐపిక్ స్పోర్ట్స్ క్రీడాకారుడు, కేంద్రీయ విద్యాలయ 8వ తరగతి విద్యార్థి ఎస్.ఊర్ధ్వసాయిన్‌ను ఓఎన్‌జీసీ ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అభినందించారు. ఓఎన్‌జీసీ ఎసెట్ కార్యాలయంలో శుక్రవారం శాంతానుదాస్‌ను ఊర్ధ్వసాయిన్ కలిశాడు. తాను సాధించిన ట్రోఫీలు, పతకాలను ఆయను చూపించాడు. ఈ సందర్భంగా శాంతానుదాస్ అభినందించడంతో పాటు ఫుట్‌బాల్ క్రీడలో మరింత రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ కోచ్ ప్రభు, ఐపిక్ సెక్రటరీ షారోన్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, క్రీడలను ప్రోత్సహిస్తున్న ఓఎన్‌జీసీ లాజిస్టిక్ సెక్షన్ ఉద్యోగి ఎస్.వెంకటరావును శాంతానుదాస్, ఓఎన్‌జీసీ లాజిస్టిక్స్ ఇన్‌చార్జి కల్నల్ జేజే జయకుమార్ అభినందించారు. ఊర్ధ్వసాయిన్ గత నెలలో జరిగిన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అండర్–13 బాలుర కేటగిరి చాంపియన్‌షిప్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలో జిల్లాకు ఆడి ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యాడు. అనంతరం అనంతపురంలో జరిగిన శిబిరంలో రాష్ట్ర జట్టుకు సెలక్టయ్యాడు. ఈనెల 12 నుంచి 24 వరకూ అస్సాంలోని జుహరత్‌లో జరిగిన ఆల్ ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు తరఫున హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, సిక్కిం జట్లతో తలపడ్డాడు.

బాధ్యతల స్వీకరణ



రాంబాబు



పుల్లంరాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1 ఆర్.రాంబాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 కె.పుల్లంరాజు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. రాంబాబు ముమ్మిడివరం నుంచి, పుల్లంరాజు ఏలూరు జిల్లా వట్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1 ఎం.రాజబాబు నిడదవోలుకు, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–2 కె.కమలప్రియ అనపర్తికి బదిలీ అయ్యారు.

రేపు 'ఆర్యాపురం' జనరల్ బాడీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా శంకరరావు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సాధారణ మహాజన సభను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక వై.జంక్షన్ లోని ఎస్‌కేవీటీ గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చల్లా శంకరరావు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి బ్యాంకు సభ్యులందరూ తమ మెంబర్ షిప్ కార్డుతో పాటు ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలన్నారు. బ్యాంకులో పాలకవర్గ సభ్యులుగా పదవీ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఈ నెల 25వ తేదీ నాటికి గడిచిన 65 రోజులలో బ్యాంకు అభివృద్ధిపై దృష్టి పెట్టి రూ.30 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. రిజర్వ్‌బ్యాంకు విధించిన సూపర్‌వైజర్ ఏక్షన్ ప్రేమ్ (శాప్) నుంచి బయటకు తీసుకు రావడానికి తీవ్రమైన కృషి చేసినట్లు తెలిపారు. బ్యాంకులో గత ప్రభుత్వ నిర్వాకం వల్ల జరిగిన అవకతవకలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు ఎనుముల రంగారావు, పిల్లి శ్యామ్, యాళ్ల కుమారస్వామి, పెదకాపు, బుడ్డిగ రావికొండలరావు, పడాల శ్రీనివాస్, సింగంపల్లి రామకృష్ణ, నీలపాల సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై విమర్శలు అనైతికం



విలేకరులతో మాట్లాడుతున్న కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, టీడీపీ నేత యిన్నమూరి దీపు చేసిన విమర్శలు అనైతికమని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భరత్ రామ్ స్నేహ ధర్మాన్ని పాటించి ఆదరించి ఉన్నత పదవి ఇస్తే.. వాటిని మరిచిపోయి దీపు మాట్లాడడం తగదన్నారు. గోదావరి బండ్‌పై ప్రముఖ హాస్య నటుడు రేలంగి విగ్రహం ఏర్పాటు చేయడానికి మాజీ ఎంపీ అడ్డు చెప్పారని విమర్శిస్తున్నారని, అయితే ఎన్నికలలో అదే సామాజిక వర్గానికి చెందిన నటుడి విగ్రహం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు రావచ్చు అనే ఉద్దేశంతోనే ఎన్నికల సమయంలో వాయిదా వేసి ఉంటారన్నారు. విగ్రహం ఆవిష్కరణ సమయంలో భరత్ రామ్‌ను గౌడ శెట్టిబలిజ నాయకులు సన్మానించారని గుర్తు చేశారు. నగరాన్ని అభివృద్ధి చేసిన భరత్ రామ్.. ప్రజల మనసుల్లో ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కుట్ర చేసి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చాయన్నారు. లడ్డూలో కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్ టీడీపీ కార్యాలయంలో ప్రకటించారన్నారు. జగన్ ప్రభుత్వంలో 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపించిన దాఖలాలు ఉన్నాయన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ సంఘటనపై సీబీఐతో విచారణ జరిపి, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో కమిటీ వేయాలన్నారు. టీటీడీ ఈవో శ్యామలరావును ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మార్తి నాగేశ్వరరావు, బిల్డర్ చిన్నా, నందం స్వామి, రొక్కం త్రినాథ్, సీరపు గణేష్ రెడ్డి, రేగుళ్ల బాల శ్రీధర్, కొమ్మంమోజు దుర్గారావు పాల్గొన్నారు.

అదిగో చిరుత.. కాదు ఇదిగో..

- సోషల్ మీడియాలో పోస్టుల వరద
- ఆందోళనలో ప్రజలు
- షికారు చేస్తున్న పుకార్లు



కడియం ఆవ ప్రాంతంలో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

రాజమహేంద్రవరం రూరల్/కడియం: చిరుత విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులతో ప్రజలు విస్తుపోతున్నారు. అక్కడ ఉంది, కాదు ఇక్కడ ఉంది, ఈ ఊరి వచ్చింది, రాత్రి కనిపించింది అంటూ పలువురు పోస్టులు పెడుతున్నారు. వాటిని పరిశీలించేందుకు అధికారులు పరుగులు పెడుతున్నారు. దివాన్ చెరువు అభయారణ్యంలో ఉన్నప్పుడు అంతగా సమస్య తలెత్తలేదు. కానీ మంగళవారం కడియం నర్సరీ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచి ఈ పుకార్లకు అంతులేకుండా పోతుంది. అధికారులు కూడా అయోమయంలో కొట్టుమిట్లాడాల్సి వస్తోంది.

లేనిపోని పోస్టులు

కడియం నర్సరీ ప్రాంతానికి చిరుత వచ్చిందని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు క్షణాల్లో తెలియడం, అందరూ అప్రమత్తం అవ్వడం సంతోషించదగ్గ విషయమే. కానీ చిరుత అక్కడ ఉంది, ఇక్కడ ఉంది అంటూ సోషల్ మీడియాలో లేనిపోని పోస్టులు పెట్టడం వల్ల ప్రజలందరూ భయాందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి మంగళవారం సాయంత్రం దోసాలమ్మ కాలనీ సమీపంలో మధు వర్మ అనే నర్సరీ రైతు ఈ పులిని చూడడం అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగింది. అధికారులు వచ్చి అక్కడ చిరుత ఉన్నట్లు కాలి ముద్ర ద్వారా గుర్తించారు.ఆ తర్వాత ఎవరూ పులిని చూసిన దాఖలు లేవు. అలాగే ఏసీసీ కెమెరాలకు చిక్క లేదు.

జాడ ఎక్కడ..

చిరుత జాడ శుక్రవారం ఎక్కడా కనబడలేదు. గురువారం కనిపించిన ప్రాంతంలో 20 ట్రాప్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాత్రి అంతా ఆ ప్రాంతాలను ఈ కెమెరాలు చిత్రీకరించాయి. శుక్రవారం ఉదయం నుంచి ఆ కెమెరాలను అధికారులు ఎంత పరిశీలించిన ఎక్కడా చిరుత జాడ కనిపించలేదు. అయితే ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటం వాల్ల దాని పాద ముద్రలు కూడా ఎక్కడ లేవు.

అధికారుల పరుగులు

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల సమీపంలో చిరుత ఉందనే సమాచారం అందడంతో ఆ జిల్లా ఫారెస్ట్ అధికారి ఎంవీ ప్రసాదరావు, తన బృందాన్ని అక్కడ పంపించారు. అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లేవు. అలాగే కడియం ఆవ ప్రాంతంలో చిరుతను చూశామని అక్కడి వాళ్ల చెప్పడంతో మరో బృందం అక్కడికి పరుగులు తీసింది. అక్కడ కూడా ఎలాంటి జాడ కనబడలేదు. అంతేకాదు గురువారం రాత్రి దుళ్ల వచ్చిందని కొందరు, ఏడిదలో ఉందని మరికొందరు తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఆయా ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఈ చిరుత సమాచారం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేన్ని నమ్మకుండా వదిలిపెట్టడానికి అవకాశం ఉండదు. అందుకని ఎవరి సమాచారం ఇచ్చినా ఆ ప్రాంతానికి పరుగులు పెడుతున్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

చిరుత సమాచారం విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎవరో చెప్పారని, లేనిపోని పోస్టింగులు పెట్టడం లేదా ఫోన్ చేసి సమాచారం ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఎక్కడ పాద ముద్రల అనుమానం ఉన్నా ఆ ఫోటోలు వీడియోలు తీసి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. చిరుత దొరికే వరకూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నారు.



ముంపునీటిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న బాలుడు

చినుకు పడితే సంద్రమే..



సత్యసాయి గురుకులం రోడ్డుపై నీరు

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రక నగరం జల సంద్రంలా మారింది. శుక్రవారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు రోడ్లపైకి ప్రవహించాయి. చెరువుల్లా కనిపిస్తున్న రహదారులపై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని సత్యసాయి గురుకులం స్కూల్ రోడ్డు శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి ముంపు బారిన పడింది. ఆ రోడ్డులో నిత్యం వందల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డులోనే సెయింటాన్స్ స్కూల్ కూడా ఉంది. ఒక పక్క ఐటీసీ కంపెనీ ప్రహరితో పాటు మరో పక్క రైల్వేకు సంబంధించిన గోడ ఉంది. ఈ రోడ్డులో వర్షం పడితే అంతే సంగతులు. నడవడానికి కూడా దారి లేకుండా చెరువులా మారుతోంది.



నగరంలోని ఓ వీధిలో ముంపు నీరు



నీటమునిగిన కృష్ణానగర్

స్వర్ణాంధ్ర పోటీల విజేతలు వీరే..



కడియంలో విజేతలతో మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు



రాజమహేంద్రవరంలో పోటీల విజేతలతో డీఐ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్, మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర–2047 అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించామని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐ) దిలీప్ కుమార్ తెలిపారు. వ్యాసరచనలో సుష్మ సాయి (ఎస్‌కేవీటీ స్కూల్), వక్తృత్వంలో కె.విన్సెట్ (ప్రతిభా ఎడ్యుకేర్ , డిబేట్‌లో జె.ఉజ్వల్, డి.యశ్వంత్ (ప్రతిభ ఎడ్యుకేర్) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పుష్పాల బాపిరాజు, సీఆర్‌ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర, కోటేశ్వరి, కుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కడియం: మండల స్థాయి స్వర్ణాంధ్ర 2047 వ్యాసరచన, వక్తృత్వ పోటీలను కడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు మణికుమార్, నాగేశ్వరరావు ప్రారంభించారు. వక్తృత్వంలో వి.లావణ్య (కడియం), సీహెచ్.మణికంఠ (వీరవరం), వర్షిత్ (మురమండ), వ్యాసరచనలో ఎస్.రమ్యశ్రీ (కడియం), కృష్ణ చైతన్య (దుళ్ల), యశ్వంత్ (వీరవరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరందరూ ఈ నెల 30వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.శ్రీనివాస్, పాల్ శంకరం, ప్రభాకర్ రాజు వ్యవహరించారు.

సినిమాలు

శ్యామల	:	దేవర
సూర్యమినీ	:	సత్యం సుందరం
సూర్యప్యాలెస్	:	దేవర
శివజ్యోతి	:	దేవర
స్వామి	:	దేవర
అశోక	:	దేవర
రాజా	:	దేవర
ఊర్వశి	:	సత్యం సుందరం
మేనక	:	మత్తు వదలరా–2
రంభ	:	దేవర
కుమారి	:	దేవర
అప్సర	:	దేవర
నామవరం		
వీఎస్ మహల్	:	దేవర
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	దేవర
కడియం		
వెంకటసూర్య	:	దేవర